క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కంకిపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో 'మీ కోసం–ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు స్థానికులు ఇళ్ల స్థలాలు, ప్లాట్ల అభివృద్ధి అంశాలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్, ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వి.భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ వి.భావన్నారాయణ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన వీఆర్వోలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మెరుగైన సేవలను అందిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, పలువురు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన డ్రోన్ వర్క్‌షాప్



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో డ్రోన్ వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. కాలేజీలో 3 నుంచి 8వ తేదీ వరకు డ్రోన్ వర్క్‌షాప్ నిర్వహించారు. డైట్ ద్రోణాచార్య టెక్ హబ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు డ్రోన్ నిపుణుడు విష్ణు ఎస్ శ్రీకాల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్ఫ్ డిఫెన్స్ మిసైల్‌సిస్టమ్ ట్రాన్స్‌మిషన్ లైన్స్ యూసింగ్ డ్రోన్స్, డ్రోన్ టెక్నాలజీ పై పలు అంశాలు వివరించారు. 60 మంది విద్యార్థులు పాల్గొనగా రెండు నెలలు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం విద్యార్థులకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి, ప్రొఫెసర్లు డాక్టర్ రావి సత్యనారాయణ, డాక్టర్ ఎం.వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి మంచం వితరణ

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లిలో ఉన్న అమ్మ వయోవృద్ధాశ్రమానికి కంకిపాడుకు చెందిన యర్రపోతు సుబ్రహ్మణ్యం, ఆయన సోదరి భార్గవి రూ. 15 వేలు విలువైన మంచం(బెడ్)ను అందజేశారు. వారి తండ్రి యర్రపోతు గంగాధరరావు జ్ఞాపకార్థం బెడ్‌ను ఆశ్రమ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు. దాతలు మాట్లాడుతూ తోటివారికి సాయపడాలన్నారు. ఆశ్రమ నిర్వాహకులు చెరుకూరి షీలా తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!

జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్లు, అండర్ పాస్‌ల వద్ద దుర్వాసన వెదజల్లుతుండటంతో అటుగా ప్రయాణిస్తే ముక్కుమూసుకోవాల్సిందే. కంకిపాడు మండలంలో సర్వీస్ రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోవడంతో అపరిశుభ్రతకు చిరునామాగా మారాయి. రహదారులు అధ్వానంగా మారుతున్నా జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వాహనచోదకులు అవస్థ పడుతున్నారు.

- ఆ రహదారులపై తాండవిస్తున్న అపరిశుభ్రత
- వ్యర్థాలతో నిండుతున్న కంకిపాడు, పునాదిపాడు అండర్ పాస్ సమీపంలో రోడ్లు
- పత్తా లేని జాతీయరహదారుల శాఖ యంత్రాంగం





కంకిపాడు అండర్‌పాస్ సమీపంలో వ్యర్థాల గుట్టలతో మేట వేసుకుపోయిన సర్వీసు రోడ్డు (ఇన్‌సెట్) పునాదిపాడు అండర్‌పాస్ సమీపంలో మరుగుదొడ్డి వ్యర్థాలతో సర్వీసు రోడ్డు మార్జిన్

కంకిపాడు: సర్వీస్ రోడ్ల వెంట చెత్తాచెదారం, సెప్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి పెనమలూరు, కంకిపాడు మండలాల్లోని పలు గ్రామాలు ఉన్నాయి. జాతీయ రహదారి విస్తరణ, దీనిలో భాగంగా సర్వీస్ రోడ్లు నిర్మించిన సంగతి తెలిసిందే. ఇవి ప్రస్తుతం అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారాయి. పట్టణంలోని పలు వ్యాపారులు, ప్రజలు వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు మార్జిన్లలో పారబోస్తున్నారు. ఆదిలోనే ఈ చర్యను అధికారులు అడ్డుకోకపోవడంతో ప్రస్తుతం సర్వీసు రోడ్లు కాస్తా డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. మాంసం వ్యర్థాలు, గృహనిర్మాణ వ్యర్థాలు, చిరు వ్యాపారులు వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు అన్నీ ఈ మార్జిన్లలో చేరుతున్నాయి. వీటికి తోడు సెప్టిక్ ట్యాంకు క్లీనర్లు ఈ మధ్య కాలంలో మరుగుదొడ్ల వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు మార్జిన్లలో పారబోస్తున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు వ్యర్థాలు కుళ్లడం, సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు రోడ్లపై చేరడం, ఆ నీటిలోనే వాహనచోదకులు, పాదచారులు ప్రయాణిస్తున్నారు. ఇటుగా వెళ్లాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చలనం లేని అధికారులు

వ్యర్థాల గుట్టలు సర్వీసు రోడ్లలో పేరుకుపోతున్నా అధికారుల్లో చలనం కలగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్య నేతల పర్యటన సమయంలో హడావుడిగా రోడ్డు మార్జిన్లను శుభ్రం చేస్తున్నారేగానీ సాధారణ రోజుల్లో ఈ రోడ్లపై పర్యవేక్షణ లేదు. ఇంత జరుగుతున్నా గ్రామాల అధికార యంత్రాంగం, జాతీయ రహదారుల శాఖ పట్టించుకోవడం లేదు. దీంతో వాహనచోదకులు మాత్రం ముక్కు మూసుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

అధికారుల జాడేదీ?

అడపా దడపా కురుస్తున్న వర్షాలతో సర్వీసు రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. ప్రత్యేకించి ఇక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

అయినా అధికారులు సమన్వయంగా వ్యవహరిస్తూ విధులను సమర్థంగా నిర్వహించటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల అభివృద్ధి అధికారులు తమ కర్తవ్యాలను బాధ్యతతో నిర్వహిస్తే వ్యర్థాలు పేరుకుపోవటం, అపరిశుభ్రత పరిస్థితుల మధ్య రాకపోకలు సాగించలేమని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

గొల్లపూడి పంటకాల్వను అభివృద్ధి చేయాలి



పాతపాడులో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

పాతపాడు(విజయవాడరూరల్): ఇటీవల వచ్చిన వరదలకు గొల్లపూడి కాల్వ పూర్తిగా పాడైందని, దాన్ని అభివృద్ధి చేసి సాగునీరు అందించాలని రైతులు అధికారులను అడిగారు. మంగళవారం పాతపాడు పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. పలువురు రైతులు గొల్లపూడి పంపింగ్‌స్కీమ్ వద్ద మోటార్లు మునిగిపోయాయని వాటిని బాగుచేయాలంటే ఐడీసీ అధికారులు ఎకరానికి వెయ్యి రూపాయలు అడుగుతున్నారని దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనే రైతు అన్నారు. పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం ఆనందంగా ఉందని వ్యవసాయశాఖ సహాయం సంచాలకుడు బి.వెంకటేశ్వరరావు ప్రస్తావించగా ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి పెట్టి నష్టపోతే ప్రభుత్వం రూ.10 వేలు వేస్తే ఎలా ఆనందంగా ఉంటామని వాకాడ రాము అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.ఈ క్రాప్ చేయలేదని సాయం అందలేదని పాపారావు అనే రైతు తెలియచేశారు. కోతుల బెడద కారణంగా కూరగాయలను సాగు చేయలేకపోతున్నామని రైతులు చెప్పగా వైఎస్సార్ సీపీ నాయకుడు యరగొర్ల శ్రీరాములు సోలార్‌సిస్టమ్ ద్వారా కోతులను ఫెన్సింగ్ ఎర్త్ ఇవ్వడంతో పారదోలవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ బి.రంగనాథ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి పి.కోటిలింగమ్మ, వ్యవసాయ సహాయకులు అక్షయ్, ఉద్యానశాఖ సహాయకులు శ్యామ్, కొండేటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతులు సామూహిక ఎలుకల నివారణ చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



గంగూరులో ఎలుకల మందు పంపిణీ చేసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మావతి

పెనమలూరు: రైతులు సామూహి ఎలుకల నివారణ చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి అన్నారు. గంగూరు, యనమలకుదురులో మంగళవారం సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, ఏఏవోలు జమిలా అంజూమ్, అహల్య, శ్రీవాణి పాల్గొన్నారు.

కంకిపాడు: సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ తెలిపారు. మండలంలోని నెప్పల్లి, కుందేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులకు ఎలుకల మందు తయారీ, పొలంలో వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకులు కె.సురేష్, ఎం.శ్రీనివాస్, బి.నాగరాణి పాల్గొన్నారు.


గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.పద్మావతి వరిలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. డీఆర్‌సీ ఏవో పద్మజ, మండల వ్యవసాయాధికారి తేజస్వి తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు ఆర్యవైశ్య ప్రార్థనామందిరంలో..



నున్న చినకంచిలో ..



ప్రొద్దుటూరు శివాలయంలో..



గన్నవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమంగళగౌరీదేవిగా..

భుక్తిముక్తిప్రదాయిని.. మహాలక్ష్మి

శరన్నవరాత్రుల్లో రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనం.. విద్యుత్ దీపకాంతులతో మిరుమిట్లు గొలుపు-తున్న ఆలయాలు... జగజ్జనని స్తోత్రాలు, లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు ఇలా దసరా ఉత్సవాలు ఊరంతా ఆధ్యాత్మిక శోభను తెచ్చాయి. శరన్నవరాత్రుల్లో మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

–గన్నవరం/కంకిపాడు/రామవరప్పాడు/పెనమలూరు/ఉయ్యూరు/విజయవాడరూరల్



రామవరప్పాడులో శ్రీ మహాలక్ష్మిదేవిగా దర్శనమిస్తున్న పేరంటాలమ్మ



ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో..



యనమలకుదురు కనకదుర్గ ఆలయంలో..



యనమలకుదురులో రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



గన్నవరంలోని శ్రీగాయత్రి మందిరంలో..

నేటి నుంచి రెండు రోజులు శిక్షణ తరగతులు

కంకిపాడు: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎంపిక చేసిన ప్రజాప్రతినిధులకు ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజులు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో తరగతులు జరుగుతాయని, ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు పంచాయతీ సాధారణ పరిపాలన, విధి విధానాలపై చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

తోపుడు బండి తగలబెట్టిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: తోపుడు బండి తగలబెట్టిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఉష తెలిపిన వివరాల ప్రకారం పోరంకి తూముల సెంటర్‌లో కొడాలి వాణి తోపుడు బండి పెట్టుకుని మొక్కజొన్న కండెలు, పండ్లు అమ్ముకుంటుంది. అదే ప్రాంతానికి చెందిన చుండూరు సుబ్బారావు అనే వ్యక్తి బండి ఇక్కడ ఎందుకు పెడుతున్నావని గొడవ పడి బండికి నిప్పు పెట్టి తగలపెట్టాడు. బండిపై ఉన్న 200 కండెలు, 30 కేజీల బొప్పాయి కాయలు, తోపుడుబండితో పాటు తగలబడ్డాయి. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోయినవి

కొటే భవనారాయణ S/o. రాజా కోటేశ్వరరావు, సింగన్నగూడెం, బాపులపాడు మండలం వీరికి సంబంధించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, రంగన్నగూడెం బ్రాంచ్‌లో డిపాజిట్ చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ తాలూకు రెండు ఒరిజినల్స్ పోయినవి.
1) 26,000/- రశీదు నెం. 3694
2) 50,000/- రశీదు నెం. 3640
దొరికిన వారు క్రింది నెంబర్‌కు సంప్రదించి అందజేయగలరు.
సెల్: 83330 39416

పాఠ్యపుస్తకాలు లేకుండా బోధన ఎలా!



ఉంగుటూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు ఇంకా చేరలేదు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్‌గా మారుస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పాఠశాలలు ప్రారంభమై నాలుగు మాసాలైనా ఉంగుటూరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇంతవరకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయకపోవడమే నిదర్శనంగా నిలుస్తోంది. గత ప్రభుత్వంలో నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇంగ్లిష్, గణితం స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్‌కు ఐదు రకాలతో కూడిన పీపీ-1 కిట్లను, ఐదేళ్లలోపు వారికి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను పంపిణీ చేసేవారు. పుస్తకాలు లేకపోవడంతో పాత పుస్తకాలతో బోధన చేయాలని అంగన్ వాడీ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తే పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ. యూకేజీలో చేరే అవకాశాలు ఉన్నాయి. ఇది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు లాభం చేకూర్చుతుందని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రూరల్ డీటీగా బేబిసరోజిని

విజయవాడరూరల్: రూరల్ తహసీల్దార్ కార్యాలయం డెప్యూటీ తహసీల్దార్‌గా బేబిసరోజిని మైనార్టీశాఖ నుంచి బదిలీపై వచ్చారు. రీసర్వే డెప్యూటీ తహసీల్దార్‌గా పద్మావతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రాజేష్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నున్న వీఆర్వోలుగా కె.రంగారావు, గోపాలకృష్ణ, పాతపాడు వీఆర్వోగా కృష్ణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

దుర్గాపురంలో భవానీలకు విశ్రాంతి శిబిరం



కేసరపల్లి శివారు దుర్గాపురంలో భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

గన్నవరం: ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీకనకదుర్గమ్మ దర్శనానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తుల సౌకర్యార్థం పోలీస్ శాఖ ఆధ్వర్యాన మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో విశ్రాంతి శిబిరం ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భవానీలు ఇక్కడ సేద తీరుతున్నారు. పోలీస్ శాఖ తాగునీరు, అల్పాహారం, పండ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తోంది. ఈ మేరకు మంగళవారం సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు, ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు నేతృత్వంలో భక్తులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల సమస్యలపై చర్చిస్తున్న సీఐటీయూ నేతలు

రామవరప్పాడు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నేత ఎం. సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి రాక ముందు కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీ ఇచ్చి 100 రోజులు దాటుతున్న ఇప్పటి వరకూ నెరవేర్చలేదని విమర్శించారు. హామీ అమలుచేయకపోతే పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.